క్లుప్తంగా

రీసర్వే డీటీ బాధ్యతల స్వీకరణ


దొరస్వామి

చౌడేపల్లె: రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా దొరస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పులిచెర్ల మండలంలో ఆర్‌ఐగా పని చేస్తూ పదోన్నతిపై చౌడేపల్లె మండలానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పారదర్శకంగా భూముల సర్వే నిర్వహించి రైతులకు న్యాయమైన రెవెన్యూ సేవలందిస్తానని తెలిపారు. భూముల రీసర్వేను పటిష్టంగా నిర్వహించి ప్రభుత్వ ఆస్తులను సంరక్షిస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయానికి సంబంధించి ధర్మకర్తల కమిటీ కోసం ఆసక్తిగల హిందూ మతానికి చెందిన అభ్యర్థులు ఈనెల 28లోపు ఎండోమెంట్ సహాయ కమిషనర్, చిత్తూరు వారికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ కమలాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం స్థానిక ఎండోమెంట్ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని అందులో సూచించారు.

గుడివంక ఆలయ కమిటీకి దరఖాస్తులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యుల కోసం 20 రోజుల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈఓ కమలకరన్ గురువారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని, వాటిని చిత్తూరు దేవదాయశాఖ అధికారులకు సమర్పించాలన్నారు. ఆలయ నూతన కమిటీ సభ్యులుగా 9 మందిని వివిధ కేటగిరీలకు సంబంధించిన వారిని ఎన్నుకుంటారన్నారు. దీంతో చైర్మన్, మిగిలిన వారు సభ్యులుగా రెండు సంవత్సరాలు కొనసాగుతారని ఆయన తెలిపారు.

భూముల సారవంతానికి పచ్చిరొట్ట


మాట్లాడుతున్న ఏడీ శివకుమార్


పుంగనూరు: భూములను సారవంతం చేసేందుకు జీలుగ, జనుము, పచ్చిరొట్టల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పరిధిలోని ఎనిమిది మండలాల్లో పుంగనూరుకు 70 క్వింటాళ్లు, చౌడేపల్లె-40, పెద్దపంజాణి-70, గంగవరం-50, సోమల-70, సదుం-66, రొంపిచెర్ల-70, పులిచెర్లకు-60 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అవసరమైన రైతులకు తమ ఆధార్ బయోమెట్రిక్ ద్వారా అందిస్తామన్నారు. పచ్చిరొట్ట 50 శాతం సబ్సిడీ, జీలుగ విత్తనం కేజీ రూ.615, జనుము పది కిలోల బ్యాగ్ రూ.545 లకు పంపిణీ చేస్తామని చెప్పారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యాధికారి

గంగవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గర్భిణులు సూచనలు పాటించాలి


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: హైరిస్క్ గల గర్భవతులు వైద్యుల సూచనలను పాటించాలని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని 7 సచివాలయాల పరిధిలోగల గర్భిణులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వారిలో 30 మంది హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి తగిన జాగ్రత్తలు తెలిపారు. పీహెచ్ఎన్ జయలక్ష్మి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిందూర్ విజయోత్సవం

పుంగనూరు: భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వివిధ సంఘాల ప్రతినిధులు స్థానిక ఇందిరా సర్కిల్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. జాతీయజెండా పట్టుకుని భారత్ మాతాకి జై..ఉగ్రవాదుల అంతమే భారత్ లక్ష్యం అంటూ నినాదాలు చేశారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

పుంగనూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలని రిటైర్డ్ తెలుగు పండితులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డి సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వెంకటపతి మాట్లాడుతూ పుస్తక పఠనంతో తమ మేథోశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు.

ఏటిగడ్డకు దారేది?

- వర్షానికి తెగిన నడక దారి
- గ్రామానికి ఆగిన రాకపోకలు
- రెండు దశాబ్దాలుగా గ్రామస్తులకు తప్పని తిప్పలు
- కౌండిన్య నది ప్రవహిస్తే కొట్టుకుపోతున్న మట్టిదారి
- గ్రామానికి పది కిలోమీటర్లు చుట్టుకెళ్లాలి


కొట్టుకుపోయిన ఏటిగడ్డ మట్టిదారి

పలమనేరు: మండలంలోని పెంగరగుంట పంచాయతీ ముసలిమడుగు నుంచి ఏటిగడ్డ గ్రామానికి దారి సమస్య ఎన్నటికీ తీరేనోనని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ గ్రామంలో యానాదులు, బీసీలకు చెందిన 40 దాకా కుటుంబాలున్నాయి. వ్యవసాయ కూలీలు, అటవీ ఉత్పత్తుల సేకరణ చేసుకుంటూ బతుకుతున్నారు. గ్రామానికి దారి సమస్యను తీర్చాలని రెండు దశాబ్దాలుగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి జిల్లా అధికారుల దాకా వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. కానీ దారి సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఇలాఉండగా గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కౌండిన్య నది ప్రవహించి నది మధ్యలోని మట్టిదారి కొట్టుకుపోయింది. దీంతో ముసలిమడుగు నుంచి ఏటిగడ్డ గ్రామానికి రాకపోకలు స్తంభించిపోయాయి. నదిలో నీరున్నంత వరకు ఈ గ్రామస్తులు పది కిలోమీటర్లు చుట్టుకొని క్రిష్టాపురం మీదుగా అటవీ మార్గంలో గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

వంతెన కడితే రెండు కిలోమీటర్లే

పలమనేరు-గుడియాత్తం మెయిన్ రోడ్డులో ముసలిమడుగు నుంచి పడమటి వైపు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. ఇక్కడికి కాలిదారి మాత్రమే దిక్కు. మధ్యలో కౌండిన్య నది ప్రవహిస్తోంది. నదిలో నీళ్లు లేనప్పుడు వెళ్లచ్చు. అదే నీరుంటే మాత్రం మండలంలోని సముద్రపల్లి, క్రిష్టాపురం గ్రామాల మీదుగా అటవీమార్గంలో గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి కాబట్టి నిధుల సమస్య కారణంగానే ఈ పనులను అధికారులు చేపట్టలేదనే మాట వినిపిస్తోంది. దీంతోపాటు దారి పక్కనున్న కొందరు రైతులు దారి వెడల్పునకు సహకరించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

జబ్బు చేస్తే ఆస్పత్రి కెళ్లడం చాలా కష్టం

ఇప్పుడున్న మట్టిరోడ్డులో ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. నది పక్కన బురదమయంగా ఉన్న దారిలో కేవలం మనుషులు కాలినడకన వెళ్లి వచ్చేవారు. ఇప్పుడు నదీ ప్రవాహంతో అదీ కొట్టుకుపోయింది. దీంతో వీరికి క్రిష్టాపురం మార్గమే దిక్కుగా మారింది. గ్రామంలోని రైతులు మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్లాలన్నా కుదరక కేవలం ఆహార పంటలను మాత్రమే సాగుచేసుకుంటున్నారు. ఇక గర్భిణులు, వృద్ధులు, పసిపిల్లలు అత్యవసరంగా ఆస్పత్రికెళ్లాలంటే క్రిష్టాపురం మార్గంలో పది కిలోమీటర్లు దూరం చుట్టుకెళ్లాల్సిందే. ఈమార్గంలో గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జల్లితోలి వదిలేశారు. ఆపై తారురోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో బైక్‌పై వెళ్లాలన్నా జల్లి కారణంగా బైక్‌లు అదుపు తప్పుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కౌండిన్యపై వంతెన లేదా క్రిష్టాపురం మార్గంలో జల్లిపై తారు రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

• రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పంరూరల్: శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రెస్కో డీఈ ప్రభాకర్ తెలిపారు. కుప్పం, గుడుపల్లె మండలాలతోపాటు కుప్పం మున్సిపాలిటీలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

• నేటి నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్ల

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులు తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు బెస్త సంఘం నాయకులు తెలిపారు. 9వ తేదీన అభిషేకం, ఆరాధన, జంగాల కథ, 10న కల్యాణోత్సవం, జంగాల కథ, సారె పంపిణీ, 11వ తేదీన జంగాల కథ, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడు రోజులు రాత్రి వేళల్లో అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కల్పవృక్ష వాహనంపై కమలకాంతుడు


కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

గంగవరం: కీలపట్ల గ్రామంలోని కోనేటిరాయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు గురువారం ఉదయం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా కల్పవృక్ష వాహనంపై, రాత్రి వేదనారాయణుడిగా మత్స్యావతారంలో సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కోలాట ప్రదర్శనలు, భక్తుల గోవింద నామస్మరణలు, చెక్క భజనల నడుమ వాహన సేవలు కోలాహలంగా సాగాయి. అడుగడుగునా భక్తులు స్వామివారి వాహనం ఎదుట కర్పూర హారతులు సమర్పించారు. కంకణం బట్టార్ నరసింహాచార్యులు, డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చక బృందం పాల్గొన్నారు.

నేడు గరుడసేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గరుడ సేవ ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.


సర్వభూపాల వాహనంపై శ్రీవారి విహారం

రెండో రోజూ బహిష్కరణ

- నిధుల వివరాలు ఇవ్వని ఎంపీడీఓ


ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

పెద్దపంజాణి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బుధవారం కూడా బహిష్కరించారు. గత రెండు రోజులుగా మండల సర్వసభ్య సమావేశం వరుసగా వాయిదా పడుతోంది. కొంతకాలంగా మండల పరిషత్ సభ్యులు మండలానికి వచ్చిన జనరల్ ఫండ్, 14, 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓ బాలాజీని పలుమార్లు కోరారు. అయితే ఇప్పటివరకు నిధులకు సంబంధించి వివరాలు ఇవ్వకపోవడంతో రెండోరోజు కూడా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తూ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేసినట్లు జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంపీడీఓ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సభ్యులు అడిగిన సమాచారం ఇచ్చే వరకూ సమావేశాలకు హాజరయ్యేది లేదని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం రాతపూర్వకంగా ఎంపీడీఓకు మరోమారు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శంకరప్ప, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా..

గురువారం సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించడం, కోరం లేకపోవడంతో ఎంపీడీఓ బాలాజి సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేశారు.

కమనీయం..మృత్యుంజయేశ్వరుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: బజారువీధిలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. వేదపండితుల సమక్షంలో మృత్యుంజయుడుగా పేరొందిన శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా శివపార్వతులకు కల్యాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా సీహెచ్ బసప్ప కుమారులు శ్రీధర్ కుటుంబీకులు వ్యవహరించారు. అనంతరం మజరారెడ్లు ఆధ్వర్యంలో గజవాహనంపై శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

వేడుకగా శ్రీవాసవిదేవి జయంతి


ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవిదేవి

పుంగనూరు: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవిదేవి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సారా తయారీ నేరం


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిబ్బంది

కుప్పంరూరల్: సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం కుప్పం మండల పరిధిలోని మోట్లచేను, అడవిబూదుగూరు, వాలూరు, గుండ్లమడుగు, కొట్టాలూరు, రామకుప్పం మండల పరిధిలోని ననియాల, పీఎంకే గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్ట్

కుప్పం మండలం, గణేష్‌పురం క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న క్రిష్ణాపురానికి చెందిన ఎం.మురుగేష్‌ను పట్టుకున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. అతని వద్ద 20 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


నివాళులర్పిస్తున్న నేతలు

బైరెడ్డిపల్లె: మండల పరిధిలోని కీలతొరిడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత జయరామరెడ్డి బుధవారం గంగవరం మండలం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలిసి వైఎస్సార్‌సీపీ నేతలు కీలతొరిడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, సర్పంచ్‌లు రాజప్ప, రేణుక, వెంకటేష్, చంద్రమౌళి, రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు నాగరాజ, ధనలక్ష్మి, భాస్కర్ మొదలి ఉన్నారు.

పరిశ్రమలకు పలమనేరు అనుకూలం


ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆమేరకు ఏపీఐఐసీ ద్వారా పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద ఎంఎస్ఎంఈలో 3.27 ఏకరాల్లో రూ.15.27కోట్లతో నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీకి ఏపీఐఐసీ జెడ్ ఎం సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సూరిబాబు, ఆర్డీఓ భవానిలతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పట్టణంలోని వెలుగు కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మొదలైన గ్రూపు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ పీడీ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నవీన్‌కుమార్, ఏఓ జ్యోతమ్మ

చౌడేపల్లె: మారుతున్న కాలానుగుణంగా రైతులు సాంకేతిక ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఏఓ జ్యోతమ్మ సూచించారు. గురువారం దుర్గసముద్రం రైతు సేవా కేంద్రంలో మాస్టర్ ట్రైనర్ నవీన్ ఆధ్వర్యంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు-డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. 30 మంది రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతిభ చూపిన ముగ్గురు రైతులకు ఆర్థిక ప్రోత్సాహక బహుమతులను, సర్టిఫికెట్లను కలెక్టర్ ద్వారా అందజేస్తామని చెప్పారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్ఓ సుధారాణి ఆదేశించారు. గురువారం ఆమె చిత్తూరులోని తన కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. గర్భిణులకు పక్కాగా సేవలు చేయాలని సూచించారు. జన ఔషధిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి


రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారి సుధారాణి

రొంపిచెర్ల: వ్యవసాయ పంటలు సాగు చేసే రైతులు సాంకేతికంగా తమ నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. ఆమె గురువారం గానుగచింత రైతు సేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు-డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. రైతులు స్మార్ట్ ఫోన్లలో వ్యవసాయ యాప్‌లను ద్వారా పంటల సాగు గురించి తెలుసుకోవచ్చున్నారు. ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకుని వ్యవసాయం సాగు చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.12వేలు, మూడవ బహుమతిగా రూ.8వేలు ఉచితంగా ఇస్తామని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి సుబ్రమణ్యం రైతులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలోనూ రాజకీయమా!

- పూజలకు వైఎస్సార్‌సీపీ రెడ్లు రాకూడదని నోటీసులిస్తారా
- నేటి పూజలను మేము బహిష్కరిస్తున్నాం
- వైవీఆర్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి, పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి


మాట్లాడుతున్న వైవీఆర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు

పలమనేరు: అధికారం ఉందని గంగమ్మ జాతరలోనూ రాజకీయాలు చేయడం మంచిదికాదు. గతంలో నుంచి వస్తున్న సంప్రదాయాలను సైతం పట్టించుకోకుండా జాతరకు వైఎస్సార్‌సీపీకి చెందిన రెడ్లు వెళ్లకూడదని పోలీసులచే నోటీసులిప్పించడం బాధాకరమని స్థానిక యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు (రెడ్డి సంఘం) అధ్యక్షుడు చెంగారెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హేమంత్ రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా గంగ జాతర సందర్భంగా తొమ్మిదో రోజు రెడ్డి సంఘం తరపున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ దఫా సైతం తాము అన్ని ఏర్పాట్లను చేసుకున్నామని అయితే అధికార పార్టీలోని కొందరు రెడ్లు జాతరలోనూ రాజకీయం చేశారన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కల్పించుకుని అందరూ రెడ్లు కలిసి పూజలు చేయాలని సూచించడంతో తాము ఎంతో ఆనందించామన్నారు. కానీ ఏమైందోగానీ పోలీసులు తమను పిలిపించి పూజలకు వెళ్లరాదని నోటీసులిచ్చారని తెలిపారు. అయితే తాము వారు పూజలు చేసి వెళ్లాక చేసుకుంటామని చెప్పినా పోలీసులు వినకుండా ఆలయ కమిటీ సైతం అభ్యంతరం తెలిపిందని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. కాదని తాము ఆలయం వద్దకెళితే బైండోవర్ కేసులు పెడతామని సీఐ చెప్పడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా జాతర విషయంలో ఎన్నడూ ఇలాంటి నీచ రాజకీయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎవరు తప్పు చేశారో వారిని ఆ గంగమ్మే చూసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులమైన రెడ్లకు ఇంత అవమానం జరిగాక నేడు జరగాల్సిన పూజకు తాము వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ఏదేమైనా నియోజకవర్గంలో 32 వేల ఓటర్లున్న రెడ్లలో గ్రూపు రాజకీయాలు తెచ్చి గంగమ్మ జాతరలో రాజకీయం చేయడం తగదన్నారు. కొండారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమేష్‌రెడ్డి, గోవిందురెడ్డి, సోము పాల్గొన్నారు.